# తన బలిమి కాదయా.....

సి హెచ్. నాగార్జున శర్మ

తిరుపతికి పదహారు కిలోమీటర్ల దూరంలో ఉంది మా ఆఫీసు. ఆఫీసు యాజమాన్యం ఉద్యోగుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని బస్సు నొకదాన్ని కొన్నారు. అందులో ప్రయాణం చేసే వారికి నెల రోజులకు సరిపడ టోకెన్లు ఇస్తారు. వాళ్ళు వాటిని ఉదయం, సాయంకాలం బస్సులో ఇవ్వాలి. ట్రాన్స్‌పోర్టేషన్ కింద కొంత డబ్బు వారి జీతంలో మినహాయించుకుంటారు. నాకు అనుకూలంగా లేకపోవడంతో నే నా బస్సులో ప్రయాణం చేయడంలేదు. ఏ ప్రైవేట్ బస్సులోనో, ఆర్‌టిసి బస్సులోనో తిరుపతి చేరడం నా కదొక అలవాటుగా మారింది.

*** *** ***

యథావిధిగా ఆఫీసవర్సు ముగియడంతో నేనూ, నా కొలీగ్ శ్రీరామ్‌తో కలిసి నడుస్తున్నాను. ఇంతలో మా వెనుక వస్తున్న జగన్నాథం మమ్మల్ని కలుసుకుని "శ్రీరామ్! బస్ టోకెన్ ఉందా" అని అడిగాడు.

"లేవు. అయిపోయినయ్. ఆఫీసులో కెళ్లి తీసుకోవాలి" అని అన్నాడు క్యాజువల్‌గా.

"మరి త్వరగా నడు. టోకెన్లు తీసుకుని బస్సుకు వెడదాం" అన్నాడు జగన్నాథం.

"నేను బస్సుకు రావడం లేదు. టోకెన్లు తీసుకుని ఆలస్యంగా వస్తాను" అని అన్నాడు.

"సరే, అయితే నే వెడతాను" అని ఉరుకులు పరుగుల మీద ఆఫీసులో కెళ్లాడు బస్ టోకెన్లు తీసుకోడానికి.

*** *** ***


నేనూ, నా కొలీగ్ శ్రీరామ్ బైపాస్ రోడ్డులో బస్ కోసం ఎదురుచూస్తున్నాం. ఇంతలో అక్కడికి గసలు బోసుకుంటూ వచ్చాడు జగన్నాథం.


"ఏం జగన్నాథం! బస్సులో వెళ్లలేదా?" అని అడిగాను.

"నేను టోకెన్లు తీసుకొచ్చేలోపు బస్సు కాస్తా వెళ్లిపోయింది. ప్రైవేటు బస్సు కెడదామని పరుగెత్తుకుంటూ వెళ్లాను. అది కూడా అలాగే తప్పిపోయింది. ఇక ఇక్కడన్నా బస్సు దొరుకుతుందేమోనని ఇటొచ్చాను" అన్నాడు రొప్పుతూ, రొజుతూ.

"ఏమంత తొందర?" అని అడిగాను.

"నా క్లోజ్ ఫ్రెండ్ నా కోసం తిరుపతిలో ఎదురు చూస్తుంటాడు. అతడికి అయిదున్నర కల్లా వచ్చేస్తానని చెప్పాను" అని అన్నాడు.






"మ..రిక్కడే అయిపోయిందిగా అయిదున్నర" అన్నాను వాచీ వంక చూసి.

"ఏం చేస్తాం! ఎప్పుడు మన కవసరమో అప్పుడు ఈ దిక్కుమాలిన బస్సులు ఓ పట్టాన వచ్చి చావవు. అనవసరమైనప్పుడు ఒకదాని వెంటొకటి పోతుంటాయి" అని తన అక్కసు నంతా వెళ్లగక్కాడు రాని బస్సుల నుద్దేశించి.

ఇంతలో క్రిక్కిరిసిన జనంతో ఉన్న ఒక వ్యాన్ రేణిగుంట వైపు వెడుతుంటే దాన్ని ఆపాడు. అందులో ఎక్కి మమ్మల్ని కూడా పిలిచాడు - "వెళ్లిపోదాం రండి" అని.

"మీ రెళ్లండి. మేము తర్వాత బస్సులో వస్తాము" అని అన్నాను.

మరి కొంతసేపటికి తిరుపతెళ్లే బస్సు వచ్చింది. అందులో ఎక్కి తిరుపతి చేరుకున్నాము.

నేనూ, నా కొలీగ్ శ్రీరామ్ తిరుపతిలో బస్సు దిగి మహాలక్ష్మి హొటల్ దగ్గర వెడుతుంటే వెనుక నుండి "శ్రీరామ్... శ్రీరామ్..." అన్న కేకలు వినవచ్చాయి. ఆ పిలిచింది ఎవరా అని వెనక్కి తిరిగి చూస్తే ఇం కెవరూ... జగన్నాథమే.

"ఏంటి జగన్నాథం? నీవు మా కంటే ముందుగా బయలుదేరి వచ్చావు కదా! ఇప్పు డొస్తున్నావేంటి?" అని అడిగాను ఆశ్చర్యంగా.

"ఏం చెప్పమంటావు గురూ!" మనం ఈ రోజు 'రాచమర్యాద'లతో తిరుపతి వచ్చాము తెలుసా!" అన్నాడు కాలరెగరేస్తూ.

"అదేంటో కాస్త వివరంగా చెప్పు గురూ! అన్నాడు శ్రీరామ్.

"వాన్ వాడు రేణిగుంట చెక్‌పోస్టు దగ్గర అందర్నీ దిగమన్నాడు. అందరూ దిగి ఎవరి దోవన వాళ్లు వెళ్లిపోయారు. నేను మాత్రం రేణిగుంట బస్‌స్టాండ్‌కు నడవడానికి బద్ధకించి చెక్ పోస్టు దగ్గరే పది, పదిహేను నిమిషాలు నుంచుని ఉన్నాను. ఇంతలో అక్కడికి లారీ రావడంతో చేతిని లారీ కేసి ఊపాను. లారీ డ్రైవర్ ఆపాడు.

"తిరుపతికి పోతుందా" అని అడిగాను.

"ఆఁ పోతుంది ఎక్కండి సర్" అన్నాడు లారీ డ్రైవర్ అతి వినయాన్ని ప్రదర్శిస్తూ.

లారీ ఎక్కాను. నాతోపాటు మరో ఇద్దరు ఎక్కారు పరుగెత్తుకుంటూ వచ్చి. వాళ్లిద్దరి దగ్గర డబ్బులు వసూలు చేసుకున్నాడు. నా జేబులోంచి పది రూపాయల కాగితం తీసి లారీ వాడి కియ్యబోయాను. లారీ అతను తనని వారిస్తూ "పరవాలే దుంచండి సర్!" అన్నాడు.

"తీసుకోండి ఫరవాలేదు" అని అన్నాను.

"వద్దు సర్" అన్నాడు లారీవాడు.

"లేదు నువ్వు తీసుకోవాల్సిందేనయ్యా!" అన్నాను పట్టుదలతో.

"వద్దంటే వద్దు సర్. మీ దగ్గర డబ్బులు తీసుకోవడమేంటి?" అన్నాడు.

ఇక లారీ వాడ్ని బ్రతిమలాడుకోవడం ఇష్టంలేక పది రూపాయల నోటును నా జేబులో పెట్టేసుకున్నాను.

*** *** ***

లారీ రేణిగుంట ఊరి పొలిమేరలు దాటి వేగంగా పోతున్నది. నేను ప్రకృతి దృశ్యాలను చూస్తూ కూర్చున్నాను. ఇంతలో లారీ వాడు నాతో "సర్, మీరు తిరుపతిలో ఎక్కడ దిగాలో చెప్పండి. మిమ్మల్ని అక్కడ దించి మా దోవన మేం పోతాం" అన్నాడు క్యాజువల్‌గా.

"అలాక్కాదు మీ లారీ ఎటు వెడుతున్నదో చెప్పండి. దాన్ని బట్టి నేను ఎక్కడ దిగేది చెబుతాను" అని అన్నాను.

"సర్! మొహమాటపడకుండా మీరు ఎక్కడ దిగాల్నో చెప్పండి. అక్కడ దించేసి మేం వెళ్లిపోతాం" అన్నాడు.

"మొహమాటపడటం కాదయ్యా బాబూ ఇద్దరికీ ఇబ్బంది లేకుండా ఉంటుందన్న ఉద్దేశ్యంతో" అన్నాను.

"నా కెటువంటి ఇబ్బంది లేదు. మీరు నిర్మొహమాటంగా చెప్పండి ఎక్కడ దిగాల్నో" అన్నాడు.

"నీ వాలకం చూస్తుంటే నేను చెప్పేంతవరకు నన్ను వదిలిపెట్టేట్లు లేవుకదయ్యా బాబూ" అన్నాను.

"అవున్ సర్" అన్నాడు.

"సరే అయితే ఆ రైల్వే బ్రిడ్జికి అవతల వైపున ఆపండి. దిగిపోతాను" అని అన్నాను.

"అలాగే సర్" అన్నాడు.

ఇంతలో నేను దిగాల్సిన స్టేజి రావడంతో లారీ వాడికి థాంక్స్' చెప్పి లారీ దిగాను.

*** *** ***

లారీ దిగిన నేను ఆలోచించడం మొదలుపెట్టాను. లారీ వాడు నా దగ్గర డబ్బులుతీసుకోకుండా, తిరుపతిలో నేను ఎక్కడ దిగాల్నో అక్కడ దింపడానికి కారణం ఏమయి ఉంటుందబ్బా, అని.

అందుకు నేను "తన బలిమి కాదయా స్థాన బలిమి అని పెద్దలు ఊరికే అనలేదు. ఇందులో నీ గొప్పతనం ఏమీ లేదు. నీవు లారీ ఎక్కిన చోటు గొప్పది. నీవు చెక్‌పోస్టు దగ్గర కదా లారీ ఎక్కింది. బహుశా లారీ వాడు నిన్ను బ్రేక్ ఇన్‌స్పెక్టర నుకుని నీ దగ్గర డబ్బులు తీసుకోకుండా, నీ వెక్కడ దిగాల్నో విచారించి మరీ దింపి వెళ్లాడు" అని అన్నాను.

"అవును గురూ!" అని నాతో శృతి కలిపాడు శ్రీరామ్.

★

